ఎన్ఎస్ఆర్ఐటిలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - ఆనందపురం: నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎన్ఎస్ఎస్‌డే -2025, స్వచ్ఛత హి సేవ -2025 కార్యక్రమాలలో భాగంగా లయన్స్ క్లబ్ బ్లడ్ బ్యాంక్ విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని 90 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శంభు ప్రసాద్ మాట్లాడుతూ ఒక వ్యక్తి రక్తదానం అనేది ముగ్గురు వ్యక్తులకు ప్రాణదానం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సీఎంఓ డాక్టర్ సుబ్బరాజు, ఎన్ఎస్ఎస్ పీఓ హరగోపాల్, ఫిజికల్ డైరెక్టర్ ఢిల్లేశ్వరరావు, ఇతర విభాగాధిపతులు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్స్, స్టూడెంట్ వాలంటీర్స్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విశాఖ కేంద్రంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్'

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నంలోని ఆధునిక సూపర్ ఈసీబీసీ భవనాన్ని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రాన్ని క్లీన్ ఎనర్జీ మార్పు విధానంలో జాతీయ స్థాయిలో నిలిపేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో విశాఖపట్నంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు ఏపీపీసీసీ సమావేశంలో ఆమోదం లభించింది. వీటికి సంబంధించిన భవిష్యత్ ఖర్చులను రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు, ఏపీజెన్కో, ఏపీట్రాన్స్‌కో సంయుక్తంగా భరించనున్నాయి. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ రాష్ట్రానికి క్లీన్ ఎనర్జీ హబ్‌గా, ఇన్నోవేషన్, స్కిల్ డెవలప్మెంట్, స్టార్టప్‌లు, పాలసీ సపోర్ట్‌కు వేదికగా కూడా పనిచేయనుంది. ఇది ఒక రిజిస్టర్ సొసైటీగా ఏర్పాటై, విద్యుత్ రంగ సంస్థలు, విద్యాసంస్థలు, థింక్ ట్యాంకులు, పరిశ్రమలు, స్టార్టప్‌లు కలిసి పనిచేసే వేదికగా మారనుంది. ఈ వేదిక ద్వారా పునరుత్పాదక విద్యుత్, స్టోరేజ్ సిస్టమ్స్, స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీలు, ఈవి ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గ్రీన్ హైడ్రోజన్ పైలట్లు, గ్రిడ్ ఆపరేషన్స్‌లో కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ వినియోగం వంటి ముఖ్య లక్ష్యాలతో కార్యకలాపాలు సాగిస్తూ పరిశోధనలకు, నైపుణ్యాభివృద్ధికి కేంద్రంగా నిలవనుంది.

అదేవిధంగా ఇంజనీర్లు, టెక్నీషియన్లకు సర్టిఫికేట్ కోర్సులలో శిక్షణ కల్పించేందుకు అకడమిక్ సంస్థలతో కలిసి షార్ట్ టర్మ్ కోర్సులను, విద్యార్థులు, పరిశోధకులకు ఇంటర్న్‌షిప్స్, ఫెలోషిప్స్, ఫ్యాకల్టీ అభివృద్ధి ప్రోగ్రామ్‌ల ద్వారా శిక్షణ అందించనుంది. ఇన్‌క్యుబేషన్ బే ద్వారా సౌకర్యాలను కల్పిస్తూ పరిశ్రమ నిపుణులకు మెంటార్‌షిప్, ఇన్వెస్టర్లతో కనెక్టివిటీ ఏర్పాటు చేయడమే కాకుండా స్టార్టప్‌లకు నిధుల సేకరణకు మద్దతుగా నిలవనుంది.

రానున్న ఐదేళ్లలో 20కి పైగా పరిశోధనలు/ ఫీల్డ్ పైలట్లు, 10కిపైగా ఎనర్జీ స్టార్టప్‌లను నెలకొల్పడం, 1,000 కంటే ఎక్కువమంది ప్రొఫెషనల్స్‌కి శిక్షణ, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎనర్జీ ట్రాన్సిషన్‌కి సంబంధించిన పాలసీలలో సలహా సూచనలు ఇవ్వటం లక్ష్యాలుగా పనిచేయనుంది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ సొసైటీ జనరల్ బాడీలో ఛైర్మన్‌గా ఎనర్జీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వైస్ ఛైర్మన్‌గా ఏపీఈపీడీసీఎల్ సీఎండీ, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీట్రాన్స్కో, ఏపీజెన్కో సీఎండీ/ఎండీలు, నెడ్ క్యాప్ ఎండీ, అకాడమిక్ సంస్థల ప్రతినిధులు (ఐఐఎమ్ -విశాఖపట్నం, ఆంధ్రా యూనివర్సిటీ, డిఎస్ఎన్ లా యూనివర్సిటీ, ఐఐపీ), థింక్ ట్యాంకులు సభ్యులుగా, ఎగ్జిక్యూటివ్ బాడీలో ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీట్రాన్స్‌కో సీఎండీలు, ఏపీఈపీడీసీఎల్ హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఈ సూపర్ ఈసీబీసీ భవనంలో ఆధునిక ఇన్నోవాషన్ ల్యాబ్, ఆర్‌అండ్‌డి వర్క్‌స్పేస్, ట్రైనింగ్ క్లాసురూమ్స్, సెమినార్ హాల్స్, స్టార్టప్ ఇన్క్యుబేషన్ బే, డిజిటల్ ట్విన్ స్మార్ట్ గ్రిడ్ సిములేషన్ సెటప్ వంటి సౌకర్యాలతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ సొసైటీ స్థాపనతో, విశాఖపట్నం దేశవ్యాప్తంగా "క్లీన్ ఎనర్జీ ఇన్నోవాషన్ హబ్"గా గుర్తింపు పొందనుంది.

ముంబై పోర్ట్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అంగముత్తు

విశాఖపట్నం పోర్ట్ చైర్ పర్సన్‌గా అంగముత్తుకు అదనపు బాధ్యతలు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్ పర్సన్ డా ఎం. అంగముత్తును ముంబై పోర్ట్ అథారిటీ చైర్ పర్సన్‌గా నియమిస్తూ కేంద్ర పోర్టులు నౌక, జల రవాణా మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ముంబై పోర్ట్ చైర్ పర్సన్‌గా ఆయన రెండు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించారు. డా. ఎం.అంగముత్తు 2023 నుంచి విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్ పర్సన్‌గా సేవలందించారు. ఆయన పదవీకాలంలో, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ (విపిఎ)కు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. వరల్డ్ బ్యాంక్ ప్రదానం చేసిన కంటైనర్ పోర్ట్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్ అవార్డ్స్‌లో 19వ స్థానం దక్కించుకుంది. విశాఖపట్నం పోర్ట్ చరిత్రలోనే గరిష్టంగా 82.62 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో నిర్వహించడం ద్వారా మరో మైలురాయి సాధించింది. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థల సమన్వయంతో పోర్ట్ అభివృద్ధితో పాటు విశాఖపట్నం నగర సుందరీకరణకూ ప్రాధాన్యతను ఇచ్చారు. ఆయన చైర్ పర్సన్‌గా ఉన్న సమయంలో పలు ముఖ్యమైన కార్యక్రమాలు చేపట్టారు. పార్కులు, రోడ్లు, మీడియన్ల అభివృద్ధి చేయడంతో పాటు నగర పరిసరాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. "ఒక మిలియన్ ప్లాంటేషన్ కార్యక్రమం" కింద ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, పొరుగు జిల్లాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కోవలోనే డా ఎం.అంగముత్తు సేవలను గుర్తించి కేంద్ర మంత్రిత్వ శాఖ ఆయనకు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ బాధ్యతలు ఆరు నెలలపాటు లేదా కొత్త చైర్మన్ నియామకం జరిగే వరకు లేదా తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొనసాగుతాయి. ఈ వివరాలను పోర్ట్ కార్యదర్శి టి.వేణు గోపాల్ మీడియాకు అందజేశారు.

చిల్లర వర్తకుల పొట్ట కొడుతున్న కూటమి

జీవీఎంసీ జోన్-8 కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆందోళన

విశాలాంధ్ర -పెందుర్తి: కూటమి ప్రభుత్వం దసరా పండుగ ముందు వేలాదిమంది తోపుడుబండ్ల వ్యాపారాలను నాశనం చేసి వారి కుటుంబ సభ్యుల కడుపులు కొట్టిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ అధికారులు లంగ్స్ పేరుతో షాపులను కూల్చివేయడాన్ని నిరసిస్తూ వేపగుంట జోనల్ కార్యాలయం వద్ద 92, 93, 94, 95, 96, 97, 98 వార్డుల పరిధిలో గల వ్యాపారస్తులతో ఏఐటీయూసీ నాయకులు భారీ ఆందోళన నిర్వహించారు. వందలాదిమంది చిరువ్యాపారులతో కలిసి జోనల్ కార్యాలయంలోకి చొచ్చుకువెళ్లి అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక్కసారిగా చిరువ్యాపారుల షాపులను కూల్చివేయడం దారుణమని మండిపడ్డారు. ఏఐటీయూసీ జోన్ 8 కార్యదర్శి వై.రాంబాబు మాట్లాడుతూ ఎక్కడ వారిని అక్కడే వ్యాపారాలు నిర్వహించుకునేలా తక్షణమే కార్పొరేటర్లు జీవీఎంసీ అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేయాలని లేనిఎడల చిరు వ్యాపారస్తులతో కార్పొరేటర్ల ఇళ్లు ముట్టడించటానికి వెనకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యమాంబ తోపుడు బండ్ల వ్యాపారులు సంఘం నాయకులు కే.శ్రీను, నాని, రాజు, వెంకటరమణ, గౌరీ పాల్గొన్నారు.

మహిళా ఖైదీల సమస్యలు పరిష్కరిస్తాం

విశాఖ సెంట్రల్ జైలును సందర్శించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ శైలజ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ బుధవారం ఉదయం విశాఖ సెంట్రల్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ముందుగా జైలులోని మహిళా బ్యారేక్‌ను పరిశీలించిన ఆమె, వారికి అందుతున్న వసతులపై సమగ్రంగా పరిశీలన చేశారు. తరువాత మహిళలకు అందుతున్న భోజన సౌకర్యాలను పరిశీలించి ఆహారం రుచి చూసిన శైలజ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ పోషమ్మ పథకం అమలు చేస్తుందని, మహిళా ఖైదీలకు కూడా 'పోషమ్మ' పథకం కింద ప్రత్యేక డైట్ ప్లాన్ అమలు చేయాలని పరిశీలిస్తున్నామని వివరించారు. ప్రస్తుతం జైలులో 80 మంది మహిళలు ఉన్నారని, వీరిలో 50 మంది గంజాయి అక్రమ రవాణా కేసుల్లో అరెస్ట్ అయిన వారు ఉన్నారన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో మత్తు పదార్థాల రవాణా కేసుల్లో జైలుకి వస్తున్నారని ఇలాంటి వారికి అవగాహన కల్పించి, స్వశక్తితో బతికేలా చర్యలు చేపడతామన్నారు. జైలులో ఉన్న మహిళా ఖైదీలకు ఐసిడిఎస్ ద్వారా పౌష్టికాహారం అందించే విధానంపై కూడా పరిశీలన జరుగుతోందని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ జాయింట్ డైరెక్టర్ చిన్మయి దేవి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామలక్ష్మి, ఇతర ఐసిడిఎస్, సెంట్రల్ జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.80 లక్షల వ్యయంతో బీటీ రోడ్ల పునరుద్ధరణ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 75వ వార్డు అభివృద్ధిలో భాగంగా కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి కృషితో సుమారు 80 లక్షల రూపాయల వ్యయంతో బీటీ రోడ్లు పునరుద్ధరించారు. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి స్వీయ పర్యవేక్షణలో సిద్దేశ్వరం జంక్షన్ నుండి ముసలినాయుడు పాలెం జంక్షన్, ముసలినాయుడు పాలెం జంక్షన్ నుండి శ్రీ పెంటమాంబ అమ్మవారి ఆలయం, బెంగాలీ స్వీట్ షాప్ నుండి పెద గంట్యాడ పీహెచ్ జంక్షన్, బాలచెరువు జంక్షన్ నుండి నడుపూరు గెడ్డ వరకు రోడ్డు పునరుద్ధరించారు.

విశాఖ డెయిరీ బడ్జెట్ రూ.1755 కోట్లు..

నికర లాభం రూ.8.51 కోట్లు..

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖ డెయిరీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1755 కోట్ల టర్నోవర్‌తో రూ.8.51 కోట్ల నికర లాభం వచ్చినట్టు ప్రకటించింది. బుధవారం డెయిరీ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ తెలియజేశారు. గత ఆర్థిక సంవత్సరంలో విశాఖ డెయిరీ 19.28 కోట్ల లీటర్ల పాలు, 5.84 కోట్ల కిలోల పెరుగును విక్రయించింది. బిగ్‌బాస్కెట్, వాల్‌మార్ట్, మెట్రో, రిలయన్స్, స్పెన్సర్స్, డి-మార్ట్, స్పెన్సర్స్, విజేత తదితర మోడరన్ ట్రేడ్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విశాఖ డెయిరీ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. విశాఖ డెయిరీ జమ్మూ కాశ్మీర్, తూర్పు నౌకాదళం, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌లలో ఆర్మీకి 31.5 లక్షల లీటర్ల టెట్రాప్యాక్ పాలను సరఫరా చేసింది. విజయనగరం సోలార్ ప్లాంట్ 17.64 యూనిట్లను ఉత్పత్తి చేసి ఏపీ ఈపీడీసీఎల్ గ్రిడ్‌కు సరఫరా చేసింది. ఆంధ్ర ప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 3700 సేకరణ కేంద్రాలకు చెందిన మూడు లక్షల మంది రైతుల నుండి కంపెనీ 28 కోట్ల లీటర్లకు పైగా పాలను సేకరించింది. వ్యాపార కార్యకలాపాలను విస్తరించడానికి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చెందిన 7 బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్‌లను దీర్ఘకాలిక ఆపరేటింగ్ లీజుపై తీసుకున్నట్లు చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్ తెలియజేశారు. 45 సొసైటీలకు పాల సేకరణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, 45 సొసైటీ భవనాలు, పాల సేకరణ పరికరాలు, ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్ల నిర్మాణం కోసం జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు రుణం, గ్రాంట్‌ను మంజూరు చేసిందని, 45 సొసైటీలకు 50 శాతం గ్రాంట్, 50 శాతం రుణంతో 1.5 శాతం వడ్డీతో 8 సంవత్సరాలలో తిరిగి చెల్లించబడుతుందన్నారు.

కొత్త పశువుల దాణా ప్లాంట్ ఏర్పాటు కోసం రూ.22.74 కోట్లు మంజూరు చేసిందని, బ్రాండ్ విజిబిలిటీని మెరుగుపరచడానికి, కొత్త మార్కెట్లపై దృష్టి పెట్టడానికి 300 ప్రత్యేక పార్లర్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. శిక్షణ, సామర్థ్య అభివృద్ధి కింద 23000 మంది పాల ఉత్పత్తిదారులు, సొసైటీ బోర్డు డైరెక్టర్లు, కార్యదర్శులు, ప్లాంట్ నిర్వహణ, మార్కెటింగ్ నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నుండి రూ.3.11 కోట్ల వ్యయంతో 100 శాతం గ్రాంట్‌తో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామీణ మార్కెటింగ్ ప్రయత్నాలు ,కొత్త భౌగోళిక పరిస్థితులతో, విశాఖ డెయిరీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26కలో రూ.2000 కోట్ల టర్నోవర్ సాధించి 20 కోట్ల లాభాన్ని సాధిస్తుందని అంచనా వేసినట్టు తెలిపారు. ఈ నెల 22 నుండి విశాఖ డెయిరీ 100 కంటే ఎక్కువ ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గించినట్టు అయన తెలిపారు.

జగన్‌ను కలిసిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో పలువురు నేతలు కలిశారు. విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, దక్షిణ నియోజకవర్గం సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తదితరులు కలిశారు.

విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకోవాలి

విశాలాంధ్ర - మధురవాడ: ఈస్ట్ నేవల్ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా బుధవారం గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా విద్యార్థులను ఉద్దేశించి "స్టోరీటెల్లింగ్: లా, లైఫ్‌లో మీ శ్రేష్ఠమైన ఆయుధం" అనే అంశంపై ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టోరీటెల్లింగ్‌కు ఏ రూల్స్ ఉండవని, ప్రతి ఒక్కరికి తన జీవిత అనుభవాల ప్రకారం చెప్పుకునే శైలి ఉంటుందన్నారు. ఇది ఒక కళగా అభివృద్ధి చేసుకోవాలని, పాఠశాల జీవితం నుంచి ప్రొఫెషనల్ జీవితం వరకూ ఇది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉద్యోగ ఇంటర్వ్యూలలో, బోర్డ్ మీటింగ్‌లలో కూడా స్టోరీటెల్లింగ్ చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం స్కూల్ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణరావు, ఇతర సీనియర్ అధ్యాపకులు హాజరయ్యారు.

పని గంటల పెంపు దుర్మార్గం: ఏఐటీయూసీ

విశాలాంధ్ర - విశాఖ: కార్మికుల పని గంటల పెంచుతూ రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలో తీర్మానం చేసి కార్మిక వర్గానికి రాష్ట్ర ప్రభుత్వం ద్రోహం తలపెట్టిందని ఏఐటీయూసీ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథరావు, జి.ఎస్.జె.అచ్యుతరావు ఒక ప్రకటనలో విమర్శించారు. 135 సంవత్సరాల క్రితం పోరాడి ప్రాణం త్యాగం ద్వారా సంపాదించుకున్న 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచడమంటే కార్మికుల శ్రమను దోపిడీ చేయడమేనని అన్నారు. యజమానులకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించడం అత్యంత దుర్మార్గమన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌ని తీసుకొచ్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. సంఘాలు పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు హరించే విధంగా ఈ లేబర్ కోడ్స్ ఉన్నాయని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేబర్ కోడ్స్ అమలు చేయకపోయినా ఆంధ్ర ప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు అత్యంత వేగంగా అమలుకు పూను కున్నారని విమర్శించారు. రాత్రి వేళల్లో మహిళలతో పనులు చేయించుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే మహిళలకు రక్షణ ఉన్న తరుణంలో రాత్రులు కూడా మహిళలు పనిచేయాలని చెప్పడం యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం తొత్తుగా వ్యవహరించడమేనని విమర్శించారు. రాష్ట్రంలో దాదాపు 13 సంవత్సరాలుగా అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతనాలు పెంచలేదన్నారు. ప్రస్తుత నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను సవరించి జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే పని గంటల పెంపును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

రాజ్యాధికారంతోనే అణగారిన వర్గాలకు విముక్తి

దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు కొరవి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దళితులు రాజకీయ శక్తిగా ఎదగాలని, రాజ్యాధికారం పొందితేనే అణగారిన వర్గాలకు విముక్తి అని అంబేద్కర్ భావించారని, ఆ దిశగానే ఆయన పోరాటం చేశారని దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు కె.వినయ్ కుమార్ అన్నారు. పూణే ఒడంబడిక దళిత రాజకీయాలపై దాని ప్రభావం అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బుధవారం అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ దళితులు రాజకీయ శక్తిగా ఎదగాలంటే ప్రత్యేక ఓటింగ్ పద్ధతి ద్వారా తమ అభ్యర్థులను తామే ఎన్నుకునే విధానం అమలు జరిగి ఉంటే నిజమైన దళిత ప్రతినిధులు ఎన్నికయ్యేవారని వినయ్ కుమార్ అన్నారు. అంబేద్కర్ కు దళితుల ఓటు హక్కు కోసం గాంధీతో వివాదం జరిగిందన్నారు. చివరికి అంబేద్కర్‌ని బెదిరించి బలవంతంగా సంతకాలు చేయించారు అని ఆరోపించారు. అప్పట్లో గాంధీ అంబేద్కర్‌ను తన ప్రాణాలతో ముడిపెట్టి అంబేద్కర్‌తో పూణే ఒడంబడిక సంతకం పెట్టించారన్నారు.

ఏఎంసీ ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఐక్యమత్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. దళితులు ఇప్పటికీ అణగారిన వర్గాలగానే ఉన్నారని అనేక సమస్యలు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాధురి శ్రీనివాస్, డాక్టర్ పల్లవి, ఆచార్య అర్జున, ఏఎంసీ ట్రెజరర్ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు ఎస్.సుధాకర్, మహేష్,వేమన తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విరమించాలి: సీపీఐ

విశాలాంధ్ర - విశాఖ : సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం 17 ప్రభుత్వం మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని సిపిఐ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గం కంచరపాలెం మెట్టు జంక్షన్ వద్ద బుధవారం నిరసన జరిగింది. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వైద్య విద్యను అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఉండాలని జాతీయ మెడికల్ కౌన్సిల్‌కి లేఖ రాసిన నేపథ్యంలో 17 మెడికల్ కళాశాలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఆ కేటాయించిన మెడికల్ కళాశాలల్లో మొదటి విడతగా ఐదు కళాశాలలను ప్రారంభించారని అన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి నిధులు లేవని ఆనాడు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మేనేజ్ మెంట్ కోటాలో సీట్లను అమ్మి, వచ్చిన నిధుల ద్వారా కళాశాల అభివృద్ధి చేస్తామని చెప్పి 107, 108 జీవోలు తీసుకువచ్చిందన్నారు. ఆ జీవోల వలన మెడికల్ సీట్లు పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఆనాడు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నారా లోకేష్ యువగళం పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 107,108 జీవోలను రద్దు చేసి పూర్తిగా 17 మెడికల్ కళాశాలను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని హామీ ఇచ్చారని, తీరా ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం తీసుకొచ్చిన 17 మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతుల్లో ప్రైవేటీకరించడానికి కూటమి ప్రభుత్వం పూనుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఉత్తర నియోజకవర్గం కార్యదర్శి నెయ్యల నాగభూషణరావు, కంచరపాలెం శాఖ కార్యదర్శి వాసుపల్లి నల్లయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మన్మధరావు, కంచరపాలెం మార్కెట్ శాఖ సహాయ కార్యదర్శి, కంచర పాలెం సీనియర్ నాయకులు ఆదినారాయణ, అక్కయ్యపాలెం శాఖ కార్యదర్శి అబ్దుల్ రజాక్, పార్టీ సభ్యులు రవి, పద్మ, కళ్యాణి, సూరిబాబు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా దినోత్సవం

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా దినోత్సవం ఘనంగా నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఇ. ఫ్లోరా తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ టి. థియోఫిలస్ మాట్లాడుతూ చదువుతో పాటు ఎన్ఎస్ఎస్, స్కౌట్స్, గైడ్స్ యూనిట్స్ యొక్క ప్రాముఖ్యత, సేవ ద్వారా ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలని, సమాజంలో సేవ యొక్క ప్రాధాన్యత వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గతంలో జరిగిన కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో 100 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రదీప్ పర్యవేక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, ఏఓ రవిబాబు, ఇంగ్లీష్ లెక్చరర్ కరుణ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలం,
విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్: ఫోన్.నెం.0891-2764949
Website: WWW.Simhachalamdevasthanam.net
Email: endow-eosvlnsd@gov.in.jc_eo_simhachalam@yahoo.co.in
సీల్డ్ కొటేషన్స్ షార్ట్ టెండర్ ప్రకటన
ఆర్.సి.నెం.ఇ1/486/2024 తేది: 24.09.2025

శ్రీస్వామి వారి దసరా 2025 సందర్భంగా ఉత్సవ ప్రత్యేక పనులు మరియు అభివృద్ధి పనులు సివిల్ మరియు ఎలక్ట్రికల్ పనులు (02 నెం.లు) పనులకు గాను సీల్డ్ కొటేషన్స్ కోరడమైనది (3 Days)

షెడ్యూల్ జారీ చేయు తేది: 25.09.2025 నుండి తేది. 27.09.2025 వరకు
షెడ్యూల్ దాఖలు చేయు ఆఖరి తేది: 28.09.2025 సాయంత్రం 04.00 వరకు
సీల్డ్ కొటేషన్లు తెరుచు తేది: 28.09.2025 సాయంత్రం 05.00 గం.లకు
Note:- Cost of Tender Schedule for Rs.500/- in favour of executive Officer, Simhachalam Devasthanam.
Contact No. +91 9618072527, +91 8519807173, +91 9177444441, +91 7659990664

సం/- వి.త్రినాధరావు, కార్యనిర్వహణాధికారి

సోనే పె సుహాగా క్యాంపెయిన్‌తో ఫిలిప్స్ హోమ్ అప్లయెన్సెస్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఫిలిప్స్ హెూమ్ అప్లయెన్సెస్ తన పాన్ ఇండియా క్యాంపెయిన్ 'సోనే పె సుహాగా'ను ప్రకటించింది. వినియోగదారులకు ఇంటికి విశ్వసనీయ ఆవిష్కరణలతో పాటు బంగారు బహుమతులతో సీజన్‌ను ఘనంగా ఆచరించుకునే అవకాశాన్ని అందిస్తుంది. ఈ క్యాంపెయిన్ ప్రధాన ఉద్దేశంలో పండుగ సీజన్ దైనందిన జీవితాన్ని సరళం చేస్తూనే శాశ్వత జ్ఞాపకాలను సృష్టించడం గురించి అని ఫిలిప్స్ విశ్వసిస్తోంది. ఐకానిక్ ఫిలిప్స్ ఎయిర్‌ఫ్రైయర్, మిక్సర్ గ్రైండర్లు, కాఫీ మెషిన్లు, గార్మెంట్ స్టీమర్లు, ఎయిర్ ప్యూరిఫైయర్లు తదితరాలు కలిగి ఉన్న ఉత్పత్తుల శ్రేణి ఇందులో ఉన్నాయి. ఇంటిని నివాసంగా మార్చడానికి బ్రాండ్ ఆవిష్కరణ, సౌలభ్యం, సంరక్షణను సమ్మిళతం చేస్తోంది. నెల పాటు కొనసాగే ఈ క్యాంపెయిన్ కొనుగోలుదారులకు ప్రతి గంటకు, నిత్యం రూ.9,999 విలువైన బంగారాన్ని గెలుచుకునే అవకాశాన్ని అందిస్తుంది. ఫిలిప్స్ హెూమ్ అప్లయెన్సెస్ సోషల్ మీడియా, రేడియో ద్వారా గంటకు ఒకసారి, జాతీయ వార్తాపత్రికల ద్వారా రోజువారీ విజేతలను ప్రకటిస్తుందని ఈ క్యాంపెయిన్ గురించి వెర్సుని ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పూజా బైద్ చెప్పారు. సోనే పే సుహాగా ప్రచారం ఫిలిప్స్ దీర్ఘకాల వాగ్దానాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు విదేశాలలో సైతం మెరుగైన అవకాశాలు

- విశాఖ వేదికగా ప్రారంభమైన నర్సింగ్ విద్యార్థుల రెండు రోజుల రాష్ట్ర సదస్సు

విశాలాంధ్ర - విశాఖపట్నం: నైపుణ్యాలతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ అన్నారు. బీచ్ రోడ్‌లోని ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్ వేదికగా 31వ ఎస్ఎన్ఏఐ ద్వైవార్షిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి సదస్సు 2025 ప్రారంభమైంది. ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ శాఖ ఈ కార్యక్రమాన్ని లెర్నింగ్ టుడే లీడింగ్ టుమారో ద జర్నీ ఆఫ్ ఏ నర్సింగ్ స్టూడెంట్ అనే అంశంపై నిర్వహిస్తోంది. ముందుగా ఫ్లోరెన్స్ నైటేంగిల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ విద్య మెరుగైన అవకాశాలను కల్పిస్తుందన్నారు. కేవలం డిగ్రీ పొందడానికే పరిమితం కాకుండా ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను సైతం అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా నర్సింగ్ విద్యార్థులకు విదేశాలలో సైతం మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఇండియన్ రెససిటెషన్ ఫెడరేషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎస్.ఎస్.సి.చక్రరావు మాట్లాడుతూ ప్రజలకు వివిధ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షురాలు (సౌత్ రీజియన్) డాక్టర్ బి.వల్లి మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు విభిన్న కోర్సులు, ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. టి.ఎన్.ఎ.ఐ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షురాలు డాక్టర్ సి.ఆర్ షంషీర్ బేగం మాట్లాడుతూ విశాఖ వేదికగా నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సు ప్రాధాన్యతలు, ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో టి.ఎన్.ఎ.ఐ ఆంధ్రప్రదేశ్ శాఖ కార్యదర్శి ఏపీ ఎన్.ఎం.సి రిజిస్ట్రార్ ఆచార్య కె.సుశీల, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య ఎస్.జ్యోతి, టి.ఎన్.ఎ.ఐ ఆంధ్రప్రదేశ్ ఎస్.ఎన్.ఎ సలహాదారు డాక్టర్ ఎం.సత్య వల్లి, ప్రెస్ అండ్ పబ్లిసిటీ చైర్ పర్సన్ ప్రీతం లూక్స్, కో చైర్ పర్సన్ చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రంగోలి, పేపర్ ప్రజెంటేషన్, క్రీడలు, సాంస్కృతిక అంశాలలో వివిధ పోటీలను నిర్వహిస్తున్నారు. వీరికి గురువారం జరిగే ముగింపు వేడుకల్లో బహుమతులను ప్రధానం చేస్తారు.

అస్సెంట్ స్కూల్లో జాతీయస్థాయి జూనియర్ చౌక్ బాల్ పోటీలు

ప్రిన్సిపాల్ కొలగాని శంకర్రావు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం పాలవలస గ్రామపంచాయతీలో ఉన్న అసెంట్ స్కూల్లో రేపటి నుండి 16వ జూనియర్ జాతీయ స్థాయి చౌక్ బాల్ పోటీలు జరగనున్నాయి. చౌక్ బాల్ గేమ్ నకు సంబంధించి మొట్టమొదటిసారిగా జాతీయస్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరవున అసేంట్ స్కూల్ వేదిక కానుంది. వివిధ రాష్ట్రాల నుండి ఈ పోటీలలో సుమారు 700 మంది క్రీడాకారులు పాల్గొంటారు. ఈ వేడుకకు సంబంధించిన ఏర్పాట్లు అన్ని సక్రమంగా నిర్వహిస్తున్నట్లు అసెంట్ స్కూల్ ప్రిన్సిపల్ కొలగాని శంకర్రావు తెలిపారు. క్రీడాకారులకు రెఫరీలకు జాతీయ స్థాయి నుండి వచ్చే అతిధులకు ఎవ్వరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సంసిద్ధం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ పోటీలను అంగరంగ వైభవంగా ర్యాలీతో ప్రారంభించనున్నామని, ఈ వేడుకకు విశిష్ట అతిథిగా మాజీ మంత్రివర్యులు,భీమిలి ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు, కోరాడ రాజబాబు, హాజరవుతారని తెలిపారు. 27వ తేదీన అంతర్జాతీయ క్రికెట్ ప్లేయర్ కేఎస్.భరత్ హాజరవుతారని చెప్పారు. జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారులు అందరికీ స్థానికుల నుండి తగిన సహకారం అందించాలని తెలిపారు.

గృహనిర్మాణాలను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: పేదల గృహ నిర్మాణ పనులు వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం జిల్లాలో గృహ నిర్మాణ ప్రగతిపై హౌసింగ్ అధికారులు, స్పెషల్ అధికారులు, జోనల్ కమిషనర్లు అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష చేశారు. జిల్లాలో వివిధ దశలలో ఉన్న పేదల గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయడంపై దిశా నిర్దేశం చేశారు. మంచి పురోగతి సాధించిన అధికారులను అభినందిస్తూ వెనుకబడిన వారి పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. మార్చి 2026 నాటికి గృహ నిర్మాణ పనులు పూర్తి చేయవలసి ఉన్నందున సంబంధిత అధికారులు అందరూ పేదల గృహ నిర్మాణం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మార్చినాటికి పూర్తి చేసుకోకపోతే ఇంటితోపాటు స్థలం పట్టా కూడా రద్దు చేయడం జరుగుతుందని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అదనంగా ఇస్తున్న ఆర్థిక సహాయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, ఈ అదనపు సహాయంతో పూర్తిస్థాయిలో ఇంటి నిర్మాణం పూర్తి అవుతుందని లబ్ధిదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లు డ్రైనేజీలు తదితర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణలలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్చార్జి హౌసింగ్ పీడీ సూరిబాబు, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, జోనల్ కమిషనర్లు, హౌసింగ్ డిఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్ వ్యాధిపై అవగాహన

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సెప్టెంబర్ నెల ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్ (ఐఐహెచ్) అవగాహన మాసోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4.30 గంటలకు ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల జీఎంఆర్ వరలక్ష్మి క్యాంపస్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ ఆసుపత్రి వైద్యులు, ప్రాంగణ హెడ్ డాక్టర్ వీరేందర్ సచిదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సును ఆన్లైన్ విధానంలో జూమ్ సెషన్ ద్వారా నిపుణులతో నిర్వహిస్తున్నామన్నారు. జూమ్ సదస్సులో పాల్గొనుటకు 4068102633 ఐడీతో పాస్ వర్డ్ : LVPEI@2025. వ్యక్తిగతంగా, ఆన్‌లైన్‌లో పాల్గొనవచ్చును అన్నారు. ఈ సదస్సు ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్ పైన అవగాహన కలిగిస్తుందని, "నాట్ జస్ట్ ఎ హెడ్ క్ " (కేవలం తలనొప్పి కాదు) అనే అంశాన్ని ప్రచారం చేస్తుందన్నారు.

ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్ వ్యాధి లక్షణాలు అతి సాధారణంగా కనిపించినప్పటికీ వాటి తీవ్రమైన మార్పులను సకాలం గుర్తించి సరియైన చికిత్స అందించటం చాల ముఖ్యమని, లేకుంటే దృష్టి లోపం తోపాటు, ఒకోసారి అంధత్వం కూడ సంభవించవచ్చునని వారు తెలిపారు. అందువలననే ఈ వ్యాధి పట్ల ప్రజలకు వృత్తిపరమైన అవగాహన పెంపొందించుటకు, రోగ నిర్ధారణ వట్ల ఆలస్యాలను నివారించుటకు మరియు ముందస్తు చికిత్సలను ప్రోత్సహించుట ద్వారా తీవ్ర పరిణామాలను తగ్గించుటకు ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఈ అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9989130882, 8099512020 ఫోన్ నెంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన వాసుపల్లి

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: వైసీపీతో కలిసి ఐదేళ్ల సుదీర్ఘ ప్రయాణం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ వైఎస్ఆర్సీపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని కలిశారు. శ్రీ తిరుమల తిరుపతి శ్రీవారి పంచలోహాల విగ్రహం అందజేసి ఆయనతో కాసేపు ముచ్చటించారు. ఐదేళ్ల క్రితం సెప్టెంబర్ 19వ తేదీ అశేష జన వాహిని గుండె చప్పుడు జగన్మోహన్ రెడ్డి సుపరిపాలన నచ్చి ఆయనతో కలిసి చేసిన తన రాజకీయ ప్రయాణం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఆపరేషన్ లంగ్స్ పేరుతో పేద ప్రజల లంగ్స్‌ను కొల్లగొట్టారని అన్నారు. ప్రభుత్వ స్థలాలను అక్రమంగా దోచుకుంటున్న బడా బాబులను వదిలేసి, పొట్ట కూటికోసం చిన్న బడ్డీ పెట్టుకుంటున్న చిరు వ్యాపారులను దారుణంగా తొలగించడమే కాకుండా వారి దుకాణాలు కూడా ధ్వంసం చేయడం సరికాదన్నారు. చిరు వ్యాపారులకు వైఎస్ఆర్సీపి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగేంతవరకు వారి పక్షాన పోరాడుతామన్నారు. స్ట్రీట్ వెండర్లుకు ప్రత్యేక హాకర్స్ జోన్స్ ఏర్పాటు చేసి నష్టపరిహారం అందజేయాలని వాసుపల్లి గణేష్ కుమార్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఆన్ లైన్ మోసాల నుంచి యువతను కాపాడడానికి తల్లిదండ్రుల గైడ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: రానున్న పండుగ సందర్భాలు, జీఎస్టీ తగ్గుదల, భారీ అమ్మకాలు, కొనుగోలు రాయితీలు నేపథ్యంలో ఆన్లైన్ మోసాలు మరింత పెరిగే అవకాశం ఉందని వాటి పట్ల యువతను అప్రమత్తం చేసి కాపాడేందుకు తాము సరే నా జాగ్రత్తలతో అప్రమత్తత వ్యవహరించేలా అవగాహన కల్పిస్తున్నట్లు అమేజాన్ ఇండియా లీగల్ విభాగ ప్రతినిధి రాకేష్ బక్షి చెప్పారు. "భారీ "కొనుగోలు ఫోన్లు, ల్యాప్ టాప్స్, హెడ్ ఫోన్లు, మరియు ఫ్యాషన్ లతో ప్రారంభమైంది. చాలామంది యువ వయోజనులకు, ఈ పండగ సీజన్ కొత్తగా కనుగొన్న ఆర్థిక స్వాతంత్ర్యంతో కలిసి వచ్చింది. ఇది మోసగాళ్లు కూడా సంచరించే సమయం అన్నారు. వెబ్ సైట్ లోని చిన్న అక్షరాలను టీన్స్ మరియ కాలేజీ విద్యార్థులు చదవడానికి సహాయపడటంలో తల్లిదండ్రులు సంరక్షకులు కూడా కీలకమైన బాధ్యతవహిస్తారన్నారు. మోసగాళ్లను గుర్తించండి, అత్యవసరతను ప్రశ్నించండి, మరియు డబ్బు గుర్తింపులను సురక్షితంగా ఉంచే అలవాట్లను రూపొందించండి అంటూ తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. వేగంగా 'ధృవీకరణలు' చేయడంలో కుటుంబాలను తాము ప్రోత్సహిస్తాం అని, ఆర్డర్లు తనిఖీ చేయడానికి అధికారిక అమేజాన్ యాప్ వాడాల్సిందిగా సూచించారు.

ట్రంప్ ఒత్తిళ్లకు మోదీ లొంగిపోరు

బిజెపి బీసీ నేత మూల వెంకటరావు

విశాలాంధ్ర - పెందుర్తి: వృత్తి నిపుణులకు ఆహ్వానం పలుకుతూ 35 సంవత్సరాలక్రితం తీసుకు వచ్చిన హెచ్ 1బి వీసా విధానం నవ ఆవిష్కరణలకు నెలవుగా అమెరికా పరపతిని పెంచిందని బిజెపి బిసీ నేత మూల వెంకటరావు పేర్కొన్నారు. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ అంటూ వలసవ్యతిరేక జాతీయ వాదంతో హెచ్1=బి వీసాలకు సంబంధించి కఠోర నిబంధనలు విధించారని తెలిపారు. వీసా రుసుం పెంపు నిర్ణయం భారతదేశానికి, అమెరికా కంపెనీల్లో కొలువు చేస్తున్న, కొత్తగా కొలువులు దక్కించుకోవాలని ఉబలాటపడుతున్న వారికి నష్టదాయకంగా తయారైందని వెల్లడించారు. హెచ్1=బి వీసాదారుల్లో 71 శాతం మంది మనదేశస్థులేనని, పైకి మిత్రపక్షం అంటూనే లోలోపల ఇండియాపై పగబట్టారన్నారు. దీనికంతటికి కారణం అగ్రరాజ్యం అపసవ్య విధానాలు, అక్కడ సాగు ఉత్పతుల ఎగుమతులను దెబ్బ తీసాయని, దాని వల్ల అక్కడి రైతుల ఆదాయాలు సన్నగిల్లుతున్నాయని తెలిపారు. అదే సమయంలో మన రైతాంగానికి నష్టం వాటిల్లకుండా మన ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించడంతో ఆయన అసహనంతో బుసలు కొడుతున్నారని తెలిపారు. వాస్తవానికి విదేశాల్లోని నిపుణులను తక్కువ వేతనాలపై నియమించుకొని ఇక్కడి కంపెనీలు దోపిడీ చేసుకునేందుకు వీలుగా అమెరికా హెచ్1=బి వీసాలను ప్రవేశపెట్టిందన్నారు. దీంతో అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగూల్, మెటా వంటి సంస్థలు బాగా లబ్దిపొందాయని వెల్లడించారు. వచ్చే నెలలో మోదీ, ట్రంప్ మధ్య జరగనున్న కీలక సమావేశంలో, ట్రంప్ ఒత్తిళ్లకు, బెదిరింపులకు భారతప్రభుత్వం ముఖ్యంగా ప్రదాని నరేంద్రమోదీ సరైన సమాధానం చెబుతారని విశ్వసిస్తున్నట్లు మూల వెంకటరావు ఆశాభావం వ్యక్తం చేసారు. భారతావణి మొత్తం మీ వెంటే ఉన్నారని, సరైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు.

ఘనంగా వరుణ్ గ్రూపు వజ్రోత్సవ వేడుకలు

ప్రభు కిషోర్ జీవిత చరిత్రపై పుస్తక ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: వరుణ్ గ్రూపు సంస్థ వజ్రోత్సవ వేడుకలను విజయవాడలోని నోవాటెల్ హెూటల్‌నందు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అనేకమంది ప్రముఖులు హాజరై సంస్థ చైర్మన్ ప్రభు కిషోర్ సాధించిన విజయాలను ప్రసంసించారు. సంస్థ వజ్రోత్సవాలు సందర్భంగా చైర్మన్ ప్రభు కిషోర్ జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరించారు. " ది విన్నేరియన్ - ఎ ఫిస్ట్ ఫుల్ ఆఫ్ ఎక్స్ పీరియన్సెస్" పేరిట ఈ పుస్తకాన్ని అమెజాన్ బెస్ట్ సెల్లింగ్ రచయితలు డాక్టర్ మీనాక్షి అనంతం మరియు అనంతం గణపతి సంయుక్తంగా రచించారు. ఈ జీవిత చరిత్ర పుస్తకంలో ప్రభు కిషోర్ జీవిత ప్రయాణాన్ని యధాతధంగా వివరించారు. ప్రధానంగా వరుణ్ గ్రూపును ఒక ప్రముఖ వ్యాపార సంస్థగా అభివృద్ధి పరచటంలో ఆయన ఎదుర్కొన్న సమస్యలను పోషించిన కీలకపాత్రను తెలియచేసారు. ప్రభు కిషోర్ జీవిత చరిత్ర పుస్తకంలో కేవలం ఆయన వ్యాపార వృద్ధిని మరియు విజయాలను మాత్రమే కాక ఆయన ఎదుర్కొన్న వైఫల్యాలను మరియు సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)గా నిర్వహించిన కార్యక్రమాలను సుస్పష్టంగా వివరించారు. వ్యాపారంలో పాటించవలసిన నిబద్ధతను మరియు మెళకువలను ఈ పుస్తకంలో రచయితలు చక్కగా తెలియచేసారు. ప్రభు కిషోర్ జీవిత చరిత్ర పుస్తకం వ్యాపార నిర్వహణలో ఎదురయ్యే విజయాలు మరియు వైఫల్యాలు మిశ్రమ సంఘటనలతో నిండి ఉంటుంది. ఈ పుస్తకం బిజినెస్ మేనేజుమెంట్ చదివే విద్యార్థులకు ఒక కేసు స్టడీగా ఉపకరిస్తుంది. అంతేకాదు ఔత్సాహిక వ్యాపారవేత్తలకు చక్కని మార్గదర్శిగా ఉపయోగపడుతుందని పుస్తక రచయితలు చెపుతున్నారు.

వరల్డ్ మెగా మారథాన్ విజేత కె.కల్యాణ్

వరల్డ్ మెగా మారథాన్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున పాల్గొన్న కళ్యాణ్ ఇన్ లైన్ స్కేటింగ్, మారథాన్ పరుగు పోటీలలో ఘన విజయం

కళ్యాణ్‌కి ఘన స్వాగతం పలికిన కెఆర్ఎస్ఏ శిష్యులు..

విశాలాంధ్ర - పీఎం పాలెం: జర్మనీలోని బెల్జియం నగరంలో జరిగిన వరల్డ్ మెగా మారథాన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున పాల్గొని పథకాలు సాధించి తిరిగి విశాఖకు చేరుకున్న వుడా పార్క్, పీఎం పాలెం సమీపంలో ఉన్న కళ్యాణ్ రోలర్ స్పోర్ట్స్ వ్యవస్థాపకులు స్కేటింగ్ దిగ్గజం కూరపాటి కళ్యాణ్ కి ఘన స్వాగతం లభించింది. రాష్ట్రం తరఫున ఎంపికైన ఆయన ఈనెల 20న జరిగిన ఇన్ లైన్ స్పీడ్ స్కేటింగ్ లో 42 కిలోమీటర్లు 21న జరిగిన 42 కిలోమీటర్ల మారథాన్ పరుగు పోటీలలో సకాలంలో పూర్తి చేసి 54 ఏళ్ల వయసులో ఘనవిజయం సాధించారు. ప్రపంచవ్యాప్తంగా 181 దేశాల నుంచి 80000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో 8 వేల మంది విజేతలుగా నిలిచారు. స్కేటింగ్ మాస్టర్ కె కల్యాణ్ గతంలో ఇండియన్ స్కేటింగ్ మాజీ కోచ్గా బాధ్యతలు వ్యవహరించారు. అంతేకాకుండా జాతీయ స్థాయిలో పలు పథకాలు సాధించిన ఘనత ఆయన సొంతమని చెప్పుకోవాలి. అదే స్ఫూర్తితో ఆయన వద్ద శిష్యులుగా స్కేటింగ్ శిక్షణ పొందుతున్న శిష్యులు కూడా ఆయన బాటలోనే నడుస్తూ జాతీయ స్థాయిలో వలు పథకాలను సొంతం చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా కళ్యాణ్ కుటుంబ సభ్యులు, విశాఖ డిస్ట్రిక్ట్ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ చంద్ర, ఉపాధ్యక్షుడు కరణం గంగాధర్, జాయింట్ సెక్రెటరీ రాజ్ కుమార్, కోచ్ లు ,వుడా పార్కు, పీఎం పాలెం వీకన్వెన్షన్ సమీపంలో ఉన్న కళ్యాణ్ రోలర్ స్పోర్ట్స్ అకాడమీ శిష్యులు, తల్లిదండ్రులు ఆయనకు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్కేటింగ్ మాస్టర్ కల్యాణ్ ప్రతి ఒక్కరికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

వెల్లంకి విలేజ్ క్లినిక్‌లో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో వెల్లంకి గ్రామంలో విలేజ్ క్లినిక్‌లో వెల్లంకి గ్రామ పంచాయతీలో మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, బిజేపి విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్, భీమిలి జోన్ మెడికల్ ఆఫీసర్ డా. రవీంద్ర పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు రెండు వారాల పాటు స్వస్త్ నారి సశక్త్ అభియాన్ ఆరోగ్యవంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబం అను సమగ్ర ఆరోగ్య ప్రచార్, సేవా కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా మెడికల్ ఆఫీసర్ రవీంద్ర గ్రామ సర్పంచ్ కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ఉపాధ్యక్షురాలు మాద బత్తుల బుజ్జి, టిడిపియువ నాయకులు పైలా రమేష్,పి.కనకరావు వైద్య బృందం రాముడమ్మ సి.హెచ్.రత్నం, హెచ్.వి సుధ రాణి ఎం.ఎల్.హెచ్.పి. ఆశా కార్యకర్తలు జి.శ్రీదేవి, టి.లక్ష్మి, ఐ.లక్ష్మి కూటమి నాయకులు మహిళలు పాల్గొన్నారు.

యిమ్మడి సిల్వర్ జ్యువలరీ షోరూమ్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆశీలుమెట్ట దరి సంపత్ వినాయఘర్ ఆలయం ప్రక్కగా కొత్తగా ఏర్పాటు చేసిన యిమ్మడి సిల్వర్ జ్యువలరీ షోరూంను సంస్థ సీఈఓ యిమ్మడి సునీత, చైర్మన్ యిమ్మడి రమేష్‌లు బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ భారతదేశంలో అతి పెద్ద వెండి ఆభరణాల బ్రాండ్‌గా ప్రసిద్ధి చెందిన యిమ్మడి సిల్వర్ జ్యువలరీ, విశాఖపట్నంలో తన 14వ షోరూంని ప్రారంభించిందని ఈ ల్యాండ్ మార్క్ షోరూమ్ అద్భుతమైన వెండి ఆభరణాలు అత్యుత్తమ హస్తకళ మరియు సృజనాత్మకతకు అద్దంపడుతూ వినియోగదారులకు అందివ్వనుందన్నారు. ప్రసిద్ధి చెందిన బ్రాండ్, సంప్రదాయం మరియు ఆధునికతను మిళితం చేసే డిజైన్లతో బ్రైడల్ సిల్వర్ జ్యూవెలరీలో ప్రత్యేకత కలిగి ఉందన్నారు. బ్రైడల్ సిల్వర్ జ్యూవెలరీకి పెరుగుతున్న డిమాండ్ను తీర్చడానికి ప్రత్యేకంగా అభరణాలు రూపొందించబడిందన్నారు. ప్రత్యేక సందర్భాలలో స్టేట్ మెంట్ పీస్ లను కోరుకునే ఎవరికైనా వన్ స్టాప్ గమ్యంగా మారుతుందన్నారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా, యిమ్మడి కస్టమర్లకు బంపర్ ఆఫర్ లని అందిస్తుందని లక్ష రూపాయల కొనుగోళ్లపై 50,000 రూపాయల విలువగల సెలెక్టెడ్ సిల్వర్ జ్యువలరీ ఉచితమని, 50000 రూపాయల విలువగల సిల్వర్ జ్యువలరీ కొనుగోళ్లపై 25000 రూపాయల విలువ గల సెలెక్టెడ్ సిల్వర్ జ్యువలరీ ఉచితం, 25000రూపాయల కొనుగోళ్లపై 12500 విలువ గల పెర్ల్ నక్షిమాల ఉచితం, 10,000 రూపాయల విలువగల సిల్వర్ జ్యువలరీ కొనుగోళ్లపై 5000విలువ గల పెర్ల్ మాల ఉచితమన్నారు. ఈ సమావేశంలో యిమ్మడి జ్యువలరీ డైరెక్టర్లు రాకేష్, జాబిలి, రాజేష్, మౌనిక పాల్గొన్నారు.

ఖాతాదారులకు ఈకేవైసీ తప్పనిసరి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం గ్రామపంచాయతీలో ఏపీజీవీబీ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత బ్యాంక్ ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ భీమా పథకాలపై అవగాహన కల్పించుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సీఎం మహిన కోరారు. బుధవారం వేములవలస, బంటుపల్లె వారి కల్లాలు, గంభీరం, ఏపీజీవీబీ ఆధ్వర్యంలో పథకాలపై డ్రైవ్ నిర్వహించి ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎం మహిన మాట్లాడుతూ గ్రామస్థాయిలో జన సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు, ఇందులో భాగంగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి, భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఈ కేవైసీ, నామిని, సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీట్ మేనేజర్ దిలీప్ శుక్ల మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న భీమపథకాలను ఖాతాదారులు సకాలంలో ప్రీమియం చెల్లించి ఆర్థిక లబ్ధి పొందాలన్నారు. ప్రజల సురక్షకతను కాంక్షించే ప్రభుత్వం అందిస్తున్న భీమ పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ కార్యక్రమంలో వేములవలస ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ డి.శ్రీనివాసరావు రివిజనల్ బ్యాంక్ సిబ్బంది, డిప్యూటర్ రీజినల్ మేనేజర్ పి.రాజేష్, పిఎసిఎస్ చైర్ పర్సన్ రౌతు నాగరాజు, ఖాతాదారులు, కూటమి నాయకులు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

20 రైస్ బ్యాగులు వితరణ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం పాలవలస గ్రామంలోని అసెంట్ స్కూల్లో శుక్రవారం నుండి 16వ జూనియర్ జాతీయ స్థాయి చౌక్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుండి సుమారు 700 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొననున్నారు. విద్యార్థులు భోజనం నిమిత్తం ఓ ఎస్ జి ఫౌండేషన్ ప్రతినిధి శివధలాయి 20 రైస్ బ్యాగులను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కే శంకర్రావుకు అందజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు, క్రికెట్ ఆటగాడు కె. ఎస్. భరత్ పాల్గొననున్నారన్నారు.